క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈఓ పరశురాం

మామడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి.. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఐఈవో పరశురాం అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీని డీఐఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులను రాబోయే వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారి జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పల్లకీ ఊరేగింపు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతల్‌పేట దత్తాత్రేయస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లకీసేవ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తుల నృత్యాల నడుమ బాదనకుర్తి, చింతల్‌పేట్ గ్రామాల్లోని వీధుల్లో శోభాయాత్ర సాగింది. అర్చకులు బొమ్మెన రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో నవరస అభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం జాతర ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కడెం: మండలంలోని ఎలగడప గ్రామంలో పడిగెల రాజన్నకు చెందిన గేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని.. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

కళాజాత

బాసర: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బాసర బస్టాండ్ ప్రాంగణంలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో గురువారం కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారులు పాటల రూపంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీఓ గంగాసింగ్, బిల్ కలెక్టర్ వంశీ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్

నిర్మల్‌టౌన్: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలోని విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుధాలు, బాంబు డిస్పోజల్, సామగ్రి వినియోగం గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డయల్ 100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ రామ్ నిరంజన్, బాంబు స్క్వాడ్ టీం రమేశ్ రాథోడ్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



వైద్యురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కుభీర్: మండలంలోని మాలేగాంలో గురువారం వైద్యురాలు స్నేహరెడ్డి వైద్యశిబిరం ఏర్పాటు చేసి మహిళలను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, శంకర్, నాయకులు రమేశ్, మహేశ్‌గౌడ్, పాపన్న తదితరులు ఉన్నారు. అనంతరం గ్రామస్తులు వైద్యురాలిని శాలువాతో సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోన్: మండలంలోని కేజీబీవీలో గణితశాస్త్రం బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి లతా దేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెస్సీ, బీఈడీ, బీఎస్సీ టెట్ అర్హత కల్గిన అభ్యర్థులు ఈనెల 6లోగా ధ్రువపత్రాలతో పాఠశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99128 32511 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇళ్ల వద్ద చదివేలా చూడాలి

కడెం: విద్యార్థులు ఇళ్ల వద్ద చదువుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన పోషకుల సమావేశంలో మాట్లాడారు. వందశాతం ఫలితాలు సాధించడానికి 90 రోజుల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు స్టూడెంట్ కౌన్సిలర్లను నియమించామని పేర్కొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తాం

- విద్యావ్యవస్థలో మార్పులకు చర్యలు
- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచన



ముధోల్‌లోని ఉన్నత పాఠశాలలో విద్యా కమిషన్ చైర్మన్ మురళి, పక్కన కలెక్టర్ అభిలాష అభినవ్

నర్సాపూర్(జి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీని కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా సౌకర్యాల గురించి ఎస్‌ఓ వీణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తొమ్మిదో తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. బోధన తీరు ఎలా ఉంది.. భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని.. విద్యను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. అనంతరం పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ రామారావు, జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఎంఈఓ కిషన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాసర: మండలంలోని బిద్రేల్లి ప్రాథమిక పాఠశాలను కమిషనర్ చైర్మన్ ఆకునూరు మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు వివరాలు తెలుసుకొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ముధోల్: నిబంధనల మేరకు నాణ్యత కల్గిన సరుకులు, కూరగాయలతోనే విద్యార్థులు మధ్యాహ్న భోజనం సిద్ధం చేయాలని మురళి అన్నారు. గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈసందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలకు వెళ్లి వంటగది, భోజనశాలలను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయాలని సూచించారు.



బాసర: బిద్రేల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మురళి

వారి వెంట ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్, ఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ మురళీదర్శన్, కార్యాలయ పర్యవేక్షకులు రణదీర్‌సాగి, డీఈవో రామారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పది నెలల్లో చేసి చూపించాం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



మండల కేంద్రంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

లక్ష్మణచాంద: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయని పనులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే చేసి చూపించామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా లక్ష్మణచాంద రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో గురువారం రైతు పండుగ కార్యక్రమానికి అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేల ఉద్యోగాలు ఇచ్చిందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకు సిలిండర్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 10 నెలల్లోనే రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేసిందని వివరించారు. సంక్రాంతి తర్వాత రైతులకు రూ.7,500 చొప్పున రైతుభరోసా ఇస్తామని తెలిపారు. గతంలో రైస్‌మిల్లుల వద్ద క్వింటాల్‌కు నాలుగు నుంచి ఆరు కిలోలు తరుగు పేరిట దోపిడీ చేసేవారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తరుగే లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి.. మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీహరిరావును కలిసిన నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సమరసింహారెడ్డి, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ అర్షదుద్దీన్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ సబి గురువారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎన్నికైన నాయకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అర్జుమంద్ అలీ, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, నాయకులు కొట్టే శేఖర్, రఫీ, మామడ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సబా కలీం, వాజిద్, మజర్, ఉస్మాన్ ఖాన్, కీసర్, అజర్,ఎజాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

మామడ: విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా..ప్రణాళికతో చదువుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మహనీయుల జీవిత చరిత్రలు చదవాలన్నారు. పాఠాలను బట్టీ పట్టకుండా అర్థం చేసుకుంటూ చదివితే ఎక్కువకాలం గుర్తుంటుందన్నారు. పదో తరగతి విద్యార్థులు చదివిన ప్రతి పాఠంపై మాక్ టెస్టు రాస్తే.. మనకు ఉన్న జ్ఞానం తెలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు జిల్లాకేంద్రంలో సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నందున వర్క్‌షాపు నిర్వహించారు. సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులను విద్యార్థులు.. గైడ్‌టీచర్ల సమక్షంలో తయారు చేశారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుల ఎన్నిక



లోకేశ్వరంలో షఫీని సన్మానిస్తున్న నాయకులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీకి చెందిన యూత్ కాంగ్రెస్ ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మహ్మద్ షఫీ, భాగాపూర్‌కు చెందిన ప్రసాద్ మండలాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గురువారం వీరిని లోకేశ్వరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి సన్మానించారు. సాయిప్రసాద్, అనిల్, విలాస్ ఉన్నారు.

కడెంలో..

కడెం: ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన రేంకల శ్రీనివాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. గురువారం కడెం హరిత రిసార్ట్స్‌లో శ్రీనివాస్‌ను సన్మానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ మండలాధ్యక్షుడు గొళ్ల వెంకటేశ్, శంకర్, రమేశ్, బొడ్డు గంగన్న, లచ్చన్న, రాజేశ్వర్‌రెడ్డి, రఫీక్ తదితరులున్నారు.



శ్రీనివాస్

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మల్లేశ్

కడెం: ఇటీవల ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించగా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన ముడికే మల్లేశ్‌యాదవ్ ఎన్నికయ్యారు.పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఆయన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



మల్లేశ్‌యాదవ్

కుంటాల మండలాధ్యక్షుడిగా మహేశ్

కుంటాల: గత నెలలో ఆన్‌లైన్‌లో నియోజకవర్గ పరిధిలో యూత్ కాంగ్రెస్ ఎన్నికలను మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావుపటేల్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సూర్యాపూర్‌కు చెందిన మహేశ్‌యాదవ్ కుంటాల మండలాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీ భోజారాంపటేల్, శంకర్‌చంద్రేతోపాటు పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



మహేశ్‌యాదవ్

ప్రపంచ మృత్తికా దినోత్సవం



కడ్తాల్ రైతువేదికలో మాట్లాడుతున్న ఏఈవో ప్రగతి



కుంటాల : ఓలాలో అవగాహన కల్పిస్తున్న ఏవో

సోన్: మండలకేంద్రంతోపాటు కడ్తాల్ రైతువేదికల్లో ప్రపంచ మృత్తికా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈవోలు ఉమామహేశ్వరి, ప్రగతి మాట్లాడుతూ నేల ప్రాముఖ్యత, భవిష్యత్తులో మానవాళికి ఏర్పడే ముప్పు, నేలసంరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గంగాదాస్, రైతులు నర్సారెడ్డి, సాయన్న, గంగన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: పంటలకు రసాయనాలు వినియోగించకుండా నేలలను కాపాడుకోవాలని ఏవో విక్రమ్ అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో మృత్తికా దినోత్సవం నిర్వహించారు. కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంతోశ్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఏఈఓలు హర్షిత, గణేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద:మండలకేంద్రంతోపాటువడ్యాల్, పీచర రైతువేదికల్లో మృత్తికా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈవోలు పంటల మార్పిడితో లాభాలు పొందవచ్చని సూచించారు. ఏఈవోలు పవిత్ర, మౌనిక పాల్గొన్నారు.

వాహనపత్రాలు కలిగి ఉండాలి

- ఖానాపూర్ సీఐ సైదారావు
- మందపల్లిలో కార్డన్‌సెర్చ్



మందపల్లిలో మాట్లాడుతున్న సీఐ సైదారావు

పెంబి: వాహదదారులు తప్పనిసరిగా బీమా, ఆర్‌సీ తదితర ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మండలంలోని మందపల్లి గ్రామంలో గురువారం ఉదయం ఏడు గంటలకు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పత్రాలు సరిగా లేని 72 బైక్‌లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని సూచించారు. విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీలు, ఆధార్ వివరాలు చెప్పొద్దని పేర్కొన్నారు. అపరిచితులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పెంబి ఎస్సై సాయికుమార్, ఖానాపూర్, దస్తురాబాద్, కడెం ఎస్సైలు రాహుల్, శంకర్, కృష్ణసాగర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎం కప్ పోటీల్లో పాల్గొనాలి



నిర్మల్‌లో మాట్లాడుతున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: యువత సీఎం కప్ పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే సీఎంకప్ పోటీలపై సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 36 విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల ఆరో తేదీలోగా http:// www. cmcup2024. telangana వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, క్రీడా అధికారులు ఉన్నారు.

7, 8న గ్రామాల్లో పోటీలు

లోకేశ్వరం: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ ఏడీ రాజానర్సయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో పోటీలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7,8 తేదీల్లో గ్రామ పంచాయతీ ఆవరణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాట్మెంట్, అథ్లెటిక్స్ పోటీలు.. ఈనెల 10 నుంచి 13 వరకు మండలస్థాయి పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఎంపీడీవో వెంకటరమేశ్, మండల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల పీఈటీలు ఉన్నారు.

6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్: యువత సీఎం కప్ పోటీలకు ఈనెల ఆరో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 10, 11, 12 తేదీల్లో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

తానూరు: ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పాఠశాలల పీడీలు, పీఈటీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తహసీల్దార్ లింగంమూర్తి మాట్లాడారు. అనంతరం స్థానిక ఆశ్రమ పాఠశాలలో మైదానం పరిశీలించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంఈవో నరేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

షెడ్డు ఏర్పాటుకు వినతి

తానూరు: మండలకేంద్రంలో అంబులెన్స్ కోసం షెడ్డు ఏర్పాటు చేయాలని మండలంలోని ఝరి(బి), తదితర గ్రామాల ప్రజలు గురువారం తహసీల్దార్ లింగంమూర్తికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ షెడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాయినాథ్, మారుతి తదితరులు ఉన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ పీఏ సీఎస్ కార్యాలయంలో యాసంగిలో సాగు చేసేందుకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో భూమి ఆశన్న తెలిపారు. ఎంటీయూ 1010 రకానికి చెందిన 25 కిలోల బస్తా రూ.995కు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కల్గినవారు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని కార్యాలయంలో దేశీయ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో వసంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బ్లాక్‌రైస్, మైసూర్ మల్లిక, గౌతమబుద్ధ, నవారా, చిట్టి ముత్యాలు, బాస్మతి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు జక్కుల తిరుపతి 90002 69724 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దుస్తులు అందజేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్మికులకు గురువారం ఎంపీడీవో సునీత యూనిఫాం అందజేశారు. ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, కారోబార్ ప్రసన్న తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి, సుర్జాపూర్, మస్కాపూర్, సేవ్యానాయక్‌తండా, తర్లపాడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో సునీత సందర్శించారు. ఈసందర్భంగా సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీవో రత్నాకర్ రావు, కార్యదర్శులు తదితరులున్నారు.

బోనాల పండుగపై పాఠం

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు.. బోనాల పండుగ పాఠాన్ని వినూత్నంగా బోధించారు. విద్యార్థులతో సంప్రదాయ వేషధారణ వేయించి పాఠం గుర్తుండిపోయేలా బోధించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని సాగర్ కాలనీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం మేధా మోరల్ పాఠశాల తొమ్మిది తరగతి విద్యార్థులు అన్నదానం చేశారు. తల్లిదండ్రులు ఇచ్చిన ప్యాకెట్ మనీ జమ చేసి అన్నదానం చేశారు. కరెస్పాండెంట్ సిద్ధార్థరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సభ

ఖానాపూర్: పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్ తెలిపారు.

మార్మోగిన రామ నామం



కొలువుదీరిన స్వామివారు



వేడుకల్లో మాదవానంద స్వామి, భక్తులు

- ఆష్టలో ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో శ్రీరామ నామం మార్మోగింది. మూడు రోజుల కిందట రామాలయంలో ప్రారంభమైన వేడుకలు శ్రీ సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ విగ్రహాల ప్రాణప్రతిష్ఠతో ముగిశాయి. రంగంపేట పీఠాధీశ్వరులు జగత్ గురువులు మాధవానంద సరస్వతీ స్వామీజీ చేతుల మీదుగా ఆలయంలో గురువందనం, వేదస్వస్తి, ప్రాతఃకాలపూజ, గర్తన్యాసం, ఉత్తరాషాడ నక్షత్రయుక్త పుష్కరాంశ యంత్రమూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహాపూజ, బలి, మహాపూర్ణాహుతి, బ్రహ్మణ సన్మానం తదితర ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌రావు పటేల్, విఠల్‌రెడ్డి వేర్వేరుగా పూజలు చేశారు. విగ్రహ దాతలు ఆర్మూర్ సంతోష్‌రెడ్డి, వాణి, ప్రొద్దుటూరు విద్యాధర్‌రెడ్డి, హరిప్రియ రెడ్డి కుటుంబసభ్యులను ఆలయ కమిటీ, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నల్ల సుకన్యరమేశ్, రావుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అశోక్, రావుల పోశెట్టి, మాజీ ఎంపీటీసీ సుస్మితపోశెట్టి, వీడీసీ సభ్యులు మెరుగు లక్ష్మారెడ్డి, బలగారి ముత్యం, మోహన్‌రెడ్డి లోలం మురళి, అనిల్, విజయ్‌సాయి, విశ్వకర్మ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

- బీజేపీ జనసభలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారుకు వచ్చే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే పి. రామారావు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో నిర్వహించిన జనసభలో పాల్గొని మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ఏడాది పాలనా వైఫల్యాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అంతకుముందు ప్రోగ్రాం కన్వీనర్ రాజేశ్‌బాబు ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ చదివి వినిపించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మహాలక్ష్మి, రుణమాఫీ, ఇంటర్ విద్యార్థులకు స్కూటీ హామీలు ఏమయ్యాయని వేదిక మీదుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తన ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించేందుకు సన్నద్ధం కాగా పోలీసులు అనుమతించలేదు. దీంతో ఎస్‌ఎస్ కాటన్ వద్ద బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, గంగాధర్, సాయినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో గ్రామస్తులకు సైబర్ నేరాలు, డయల్100, రోడ్డు భద్రత నిబంధనలపై ఎస్సై హన్మాండ్లు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.